
సాక్షి పల్నాడు
సోమవారం । 20 । నవంబర్ । 2023



రాహు-కేతు పూజలు

నకరికల్లు: నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి గుడిలో ఆదివారం రాహు-కేతు పూజలు నిర్వహించారు. దోష నివారణకు భక్తజనం తరలివచ్చారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2,423 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 870 క్యూసెక్కులు వదిలారు.



గ్యార్మీ వేడుకలు

పొన్నూరు : పట్టణంలోని ప్రగతి ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. మహబూబ్ సుభాని జెండా ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం జరిపారు.

న్యూస్‌రీల్

బండ్లమ్మకు ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : చందోలులోని బగళాముఖి బండ్లమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

విద్యార్థులకు బెన్‘ఫిట్’

గుంటూరు ఎడ్యుకేషన్: తరగతి గదిలో నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థుల్లో శారీరక దారుఢ్యాన్ని పెంచి, మానసిక ఉల్లాసాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ‘‘ఫిట్ ఇండియా స్కూల్ వీక్’’ పేరుతో సోమవారం నుంచి వారోత్సవాలను నిర్వహించనుంది. క్రీడలతో పాటు యోగా, ధ్యానం, నైపుణ్యం, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, మేధో వికాసం పెంచే ఉద్దేశంతో సోమవారం నుంచి ఈనెల 25 వరకు ఆరు రోజుల పాటు వినూత్న కార్యక్రమాల నిర్వహణకు విద్యాశాఖ సమగ్ర షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఫిట్ ఇండియా స్కూల్ వారోత్సవాలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదేశించారు. వారోత్సవాల నిర్వహణను పర్యవేక్షించాలని డీవైఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలిచ్చారు.

విజయకీలాద్రిపై శ్రవణా నక్షత్ర వేడుకలు



తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం శ్రవణా నక్షత్ర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చినజీయర్‌స్వామి మంగళా శాసనాలతో శ్రవణా నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి ఉదయం 9 గంటల నుంచి పంచామృతాలతో తిరుమంజనం నిర్వహించామని, 10 గంటలకు విజయాద్రి శ్రీనివాసునికి నిత్య కల్యాణ ఉత్సవం నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వెల్లడించారు.

బూందీ రూపంలో వెండి సమర్పణ



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి విజయవాడకు చెందిన భక్తులు కేశనం జగదీశ్వరావు దంపతులు కిలో వెండితో తయారు చేసిన బూందీ ఆకారంలో వస్తువు సమర్పించుకున్నారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న వీరు సుమారు రూ.76 వేలు విలువైన కిలో వెండి ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందించారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

22న జూడో క్రీడాకారుల ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: జూడో క్రీడాకారుల సెలక్షన్స్ ఈ నెల 22వ తేదీన హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణా జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు వర్రె అంజిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయి గీతాంజలి హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి జూడో క్రీడాకారుల ఎంపిక ఉంటుందని చెప్పారు. సబ్ జూనియర్ విభాగంలో జిల్లా జట్టు ఎంపిక నిమిత్తం నిర్వహించే ఈ సెలక్షన్స్‌కు 2009 నుంచి 2011 మధ్య జన్మించిన బాల బాలికలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జూడో కోచ్‌లు, క్రీడాకారులు 9948656781 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సామాజిక జీవన సౌందర్యం

- సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం
- నరసరావుపేట నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ధి
- నేడు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర
- జయప్రదానికి నరసరావుపేట ప్రజలు సిద్ధం

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట: దేశంలో మరెక్కడా లేనివిధంగా బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేలు చేస్తోంది. గతంలో సామాజిక న్యాయం, రాజ్యాధికారం వంటి మాటలు పాలకులు గొప్పగా చెప్పుకునేందుకు ఉపయోగపడేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్ని రకాలుగా ప్రాధాన్యమిచ్చి సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపారు. జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన మేలు, సంక్షేమ పథకాల అమలుతో చేకూరిన లబ్ధిని చెప్పుకునేందుకు, సమాజంలో అణగారిన వర్గాలకు లభించిన గౌరవ మర్యాదలను వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర చేపట్టింది. పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో సోమవారం యాత్ర జరగనుంది. సాయంత్రం 5 గంటలకు పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. యాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించారు. యాత్ర విజయవంతమయ్యేలా పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించారు.

నాలుగున్నరేళ్లలో రూ.814 కోట్ల లబ్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాలుగున్నరేళ్లలో నరసరావుపేట నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం ద్వారా రూ.814 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇందులో నగదు బదిలీ ద్వారా 80,449 మందికి రూ.583 కోట్లు, నగదు బదిలీయేతర మార్గాల ద్వారా 84,854 మందికి రూ.231 కోట్ల మేర ప్రయోజనం కలిగింది. ఎమ్మెల్యేగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జగనన్న స్ఫూర్తితో నరసరావుపేట నియోజకవర్గంలో అన్ని వర్గాలకూ అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రయోజనాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎంపీ నిధులు, దాతల సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పలు చోట్ల కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలు, సామాజిక సత్రాలు నిర్మించారు. టీటీడీ సహకారంతో రొంపిచర్ల, బుచ్చిబాపన్నపాలెం, వి.రెడ్డిపాలెంలో కల్యాణ మండపాలు, విప్పర్లలో షాదీఖానా, సంతగుడిపాడు, గోగులపాడు, మాచవరం, పెట్లూరివారిపాలెం కాకాని, రంగారెడ్డిపాలెంలో గ్రామాల్లో ఎస్సీలకు కమ్యూనిటీ హాళ్లు, పెదరెడ్డిపాలెంలో ఎస్టీలకు కమ్యూనిటీ హాలు అందుబాటులోకి తెచ్చారు. ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటు చేశారు. పమిడిపాడులో కాపు కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. నరసరావుపేట పట్టణంలో పెద్దచెరువులో వడ్డెర కమ్యూనిటీ హాలు, బరంపేటలో కాపుల విరామక్షేత్రం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వినుకొండ రోడ్డుపై ఏకలవ్యుడి విగ్రహం, స్టేషన్ రోడ్డులో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య, పల్నాడురోడ్డులో మహాకవి గుర్రం జాషువా విగ్రహాలు ఏర్పాటు చేశారు.



పట్టణంలోని పల్నాడు రోడ్డులో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. బస్సు యాత్ర ప్రారంభమయ్యే బసికాపురం, పాదయాత్ర ప్రారంభమయ్యే ఎల్‌టీనగర్, చిలకలూరిపేటరోడ్డు రైల్వేఓవర్ బ్రిడ్జి, మల్లమ్మసెంటర్, పల్నాడు రోడ్డులోని బహిరంగ సభ జరిగే ప్రదేశాలను పరిశీలించారు. ఎల్‌టీనగర్ వద్ద లక్ష్మీతిరుపతమ్మ తల్లికి పూజలు నిర్వహించటం, ఎస్ఆర్‌కేటీ వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ, ఇమామ్, క్రిస్టియన్ ఫాదర్ల ప్రత్యేక ప్రార్థనలు, శివునిబొమ్మసెంటర్‌లోని శివ విగ్రహం వద్ద పూజారుల ప్రత్యేక పూజల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యలో ఐదుచోట్ల స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. బహిరంగ సభలో 20 వేలమంది పాల్గొనేలా ఏర్పాట్లు జరిగాయి. సభలో పాల్గొనే వారందరికీ ఎస్ఎస్ఎన్ కళాశాలలో భోజన ఏర్పాట్లు చేయనున్నారు. రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ పి.విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, సినీ నటుడు ఆలీ, మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, కుంభారవి, పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం తదితరులు హాజరుకానున్నారు.

నగదు బదిలీ ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలో కలిగిన లబ్ధి

వర్గం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
బీసీ	48,786	361.8
ఎస్సీ	24,397	170
ఎస్టీ	4,974	34.5
మైనార్టీ	2,292	16.7
మొత్తం	80,449	583

నగదు బదిలీయేతర మార్గాల ద్వారా కలిగిన లబ్ధి

వర్గం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
బీసీ	48,731	147.4
ఎస్సీ	28,474	61.7
ఎస్టీ	5,328	13
మైనార్టీ	2,321	9.1
మొత్తం	84,854	231.2

యాత్ర షెడ్యూల్ ఇలా..

- సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి నియోజకవర్గంలోని వివిధ రంగాల్లోని వ్యక్తులతో ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి సమావేశం కానున్నారు.
- మధ్యాహ్నం 2.15 గంటలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతల మీడియా సమావేశం
- మధ్యాహ్నం 3 గంటలకు చిలకలూరిపేట రోడ్డులోని లక్ష్మీతిరుపతమ్మ దేవాలయంలో పూజల అనంతరం పాదయాత్ర ప్రారంభం
- సాయంత్రం 5 గంటలకు పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ

యాత్రను జయప్రదం చేద్దాం

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేలు చేసింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా జగనన్న ఎంతో ప్రోత్సాహం అందించారు. ఆయా మేలులను ప్రజలకు వివరించేందుకే ఈ సామాజిక సాధికార యాత్ర. యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాను. ప్రతి ఒక్కరూ యాత్రలో భాగం కావాలి.

– డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే, నరసరావుపేట

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆది దంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. భక్తులు మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకున్నారు. రద్దీ నేపథ్యంలో ఉదయం 9 గంటలకే కార్లు, ఇతర వాహనాలను కనకదుర్గనగర్ వైపు మళ్లించారు. మరో వైపున మహా మండపం లిఫ్టు మార్గం ద్వారా వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకే అనుమతించారు. రూ.500, రూ.300, రూ.100 టికెటు క్యూలైన్‌తో పాటు సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కనిపించింది. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో చంద్రశేఖర్‌లు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు అందచేశారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

వైద్యయంత్రాంగం భేష్



జీజీహెచ్‌కు సమకూర్చిన రూ.4 కోట్ల విలువైన ఆధునిక సీటీ సిమ్యులేటర్ యంత్రం, రూ.20 లక్షల విలువైన సీఆర్మ్ పరికరం, రూ.15 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలేటర్

జీజీహెచ్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఆస్పత్రిలో 110 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- కోట్లాది రూపాయల వైద్య పరికరాలు మంజూరు
- సివిల్, ఎలక్ట్రికల్ పనుల కోసం ప్రత్యేక నిధులు
- భవన నిర్మాణాల కోసం రూ.కోట్లు విడుదల

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాసుపత్రిగా గుంటూరు జీజీహెచ్ పేరు గడించింది. గత ప్రభుత్వంలో టార్చిలైట్ వెలుతురులో ఆపరేషన్లు.. ఎలుకల దాడిలో పసికందు మృతి లాంటి ఘటనలతో ఆస్పత్రి ప్రతిష్ట మసకబారింది. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు జీజీహెచ్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో 110 పోస్టులు భర్తీ చేసేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అనుమతులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే జీజీహెచ్‌లో కనీవినీ ఎరుగని రీతిలో 250 స్టాఫ్‌నర్సుల పోస్టులు మంజూరు చేశారు. నూతనంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జెన్సీ మెడిసిన్, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ వైద్య విభాగాలను మంజూరు చేశారు. యూరాలజీ, న్యూరాలజీలో అదనపు యూనిట్లను మంజూరు చేశారు. నూతనంగా 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులనూ మంజూరు చేశారు. పారా మెడికల్ పోస్టులు భారీగా భర్తీచేశారు.

రూ.కోట్లతో వైద్య పరికరాలు..

ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గుంటూరు జీజీహెచ్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రూ.కోట్లు ఖరీదు చేసే వైద్య పరికరాలు మంజూరు చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల కంటే దీటుగా అత్యాధునిక వైద్య పరికరాలతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు నిరుపేదలకు నేడు ఉచితంగా జీజీహెచ్‌లో లభిస్తున్నాయి. క్యాన్సర్ సెంటర్‌లో రెండు నెలల క్రితం రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్‌సిటీ పరికరాన్ని మంజూరు చేశారు. ఆసుపత్రికి రూ. 4 కోట్లు ఖరీదుచేసే సిటీస్కాన్ పరికరాన్ని ఇటీవల కాలంలో మంజూరు చేశారు. రూ.15 కోట్లు ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, రూ. 40 లక్షలు ఖరీదు చేసే సీఆర్మ్ పరికరాలు, రూ. 25 లక్షలు ఖరీదు చేసే కొలనోస్కోపి, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఏబీజీ మిషన్లు, రూ.25 లక్షలు ఖరీదు చేసే మైక్రోస్కోప్, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్ లైట్లు, రూ.15 లక్షలు ఖరీదు చేసే మానిటర్స్, రూ.16 లక్షలు ఖరీదు చేసే ఓటీ కార్ట్స్, రూ.20 లక్షలు ఖరీదు చేసే ఎకోమిషన్, ఎస్ఐసీయూ, పీఐసీయూలో రూ.కోటి ఖరీదు చేసే వైద్య పరికరాలను మంజూరు చేశారు. కోవిడ్‌లో ఆసుపత్రి మొత్తం ఆక్సిజన్ సరఫరా జరిగేలా ప్లాంట్ల నిర్మాణం, ఆక్సిజన్ పైపుల నిర్మాణం చేయడంతోపాటు, 200లకుపైగా వెంటిలేటర్లను ప్రభుత్వం సరఫరా చేసింది.

జీజీహెచ్‌కు స్వర్ణయుగం..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కాలం జీజీహెచ్‌కు స్వర్ణ యుగం లాంటిది. ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నేడు అభివృద్ధి జరుగుతోంది. ఎప్పటినుంచో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ అయ్యాయి. నూతనంగా పోస్టులను సైతం మంజూరు చేశారు. అత్యాధునిక వైద్య పరికరాలు ఇవ్వడంతో కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా ఆపరేషన్లు చేస్తున్నాం. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా సహకారంతో ఆసుపత్రిలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

రూ. 80 కోట్లతో ఎంసీహెచ్ వార్డు

టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రెండు సార్లు శిలాఫలకాలు వేసి ఒక్క ఇటుక కూడా కట్టకుండా పబ్లిసిటీ చేసుకున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ వార్డు (మాతాశిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వం, జింఖానా సహకారంతో రూ. 80 కోట్లతో నిర్మితమవుతున్న ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎంసీహెచ్ నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ తీసుకుని జింఖానా ప్రతినిధులు, ముఖ్యమంత్రితో మాట్లాడటంతో భవన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రస్తుతం మూడంతస్తులు నిర్మాణం పూర్తయింది. మరో మూడంతస్తులు పూర్తయితే మాతా, శిశు మరణాల తగ్గింపునకు ఈ కేంద్రం ఎంతో దోహదపడుతోంది. గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన సర్వీస్‌బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 7.5 కోట్లు మంజూరు చేసింది. కాకుమానువారితోటలో నూతన ఓపీ భవన నిర్మాణం కోసం మంజూరు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ. 3.5కోట్లు మంజూరు చేసింది. ఆసుపత్రిలో సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతుల కోసం రూ. 5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

జన జీవితాలకు సీఎం జగన్ భరోసా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో మంత్రి విడదల రజిని

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 27 మందికి రూ. 27.88 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట: ప్రజల జీవితాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. యడ్లపాడుకు చెందిన కారుచోల శ్రీనివాస్‌కు రూ.5 లక్షలు, గణపవరానికి చెందిన నాగిశెట్టి శ్రీనివాసరావుకు రూ.1.20 లక్షలు, పట్టణానికి చెందిన దాసరి ప్రసాద్‌కు రూ.1.50 లక్షలు, కొండవీడుకు చెందిన షేక్ షెహనాజ్‌కు రూ.2.10 లక్షలు, సొలసకు చెందిన బాపతు బాలకృష్ణారెడ్డికి రూ.1.10 లక్షలు ఇలా నియోజకవర్గంలోని మొత్తం 27 మందికి రూ.27.88 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని వెల్లడించారు. ఒకవైపు ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందజేస్తూనే మరోవైపు వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందిన వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంత మానవత్వం ఉన్న ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేరని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


టెన్త్ విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి

- ఉచితంగా స్టడీ మెటీరియల్
- జెడ్పీ పాలకవర్గం వరం
- వరుసగా రెండో ఏడాదీ పంపిణీకి చర్యలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 39వేల మందికి ప్రయోజనం

గుంటూరు ఎడ్యుకేషన్: ‘‘జగనన్న విద్యాజ్యోతి’’ పేరుతో టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీకి జిల్లా పరిషత్ పాలకవర్గం వరుసగా రెండో ఏడాదీ చర్యలు చేపడుతోంది. గతేడాది రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ వినూత్న కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, మోడల్, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ పాఠశాలలతోపాటు కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ వరంగా మారనుంది. ఎంపిక చేసిన సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యాశాఖాధికారుల నుంచి అందుకున్న జెడ్పీ పాలకవర్గం పుస్తకాల ముద్రణకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెలాఖరులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనుంది. దీంతో పాటు గతేడాదిలాగానే ఈ ఏడాదీ జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్లలో అల్పాహారం పంపిణీ చేయాలని క్రిస్టినా నిర్ణయించారు.

రూ.70 లక్షల వ్యయం

గతేడాది రూ.61.80 లక్షల వ్యయంతో 36,155 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 39వేల మంది విద్యార్థులు చదువుతున్నట్లు గుర్తించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రూ.70 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. పూర్తిగా జెడ్పీ నిధులతో తెలుగు, ఇంగ్లిషు మీడియంల వారీగా మెటీరియల్ ముద్రణ చేపడుతున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా సూచన మేరకు గుంటూరు డీఈఓ పి.శైలజ సబ్జెక్టు నిపుణులతో మెటీరియల్ రూపొందించారు.



జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ (ఫైల్)

సీఎం జగన్ నుంచి ప్రశంసలు

చదువుల విప్లవాన్ని తెచ్చిన సీఎం వైఎస్ జగన్ బాటలోనే గత ఏడాది చేపట్టిన జగనన్న విద్యాజ్యోతి కార్యక్రమం అద్భుత ఫలితాలనిచ్చింది. ఉచిత మెటీరియల్ పంపిణీతో టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెరిగింది. ఫలితంగా సీఎం వైఎస్ జగన్ నుంచి ప్రశంసలు అందుకున్నాం. పొరుగు జిల్లాలకు ఆదర్శంగా నిలిచాం. ప్రస్తుతం రెండో దఫా స్టడీ మెటీరియల్ ముద్రణకు చర్యలు చేపడుతున్నాం. ఫిబ్రవరిలో అల్పాహారం అందజేతకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– కత్తెర హెనీ క్రిస్టీనా, జెడ్పీ చైర్‌పర్సన్

హోరాహోరీగా జాతీయ స్థాయి క్రీడా పోటీలు

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు 2,500 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. పురుషులు, మహిళల విభాగాల్లో తలపడ్డారు. పురుషుల విభాగంలో బాస్కెట్ బాల్ – 11, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ – 27, ఖోఖో – 8, కబడ్డీ – 33, రోప్ స్కిప్పింగ్ – 7, టేబుల్ టెన్నిస్ డబుల్స్ – 3 టీములు, అథ్లెటిక్స్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో 22 మంది, 400 మీటర్ల పరుగు పందెంలో 27 మంది, 1,500 మీటర్ల పరుగు పందెం – 14 మంది, లాంగ్ జంప్‌లో 21 మంది, ట్రిపుల్ జంప్‌లో 8 మంది, షాట్‌పుట్‌లో 17 మంది, డిస్క్‌త్రోలో 13 మంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బిగ్ స్క్రీన్‌పై వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్

నరసరావుపేట: ఇండియా – ఆస్ట్రేలియా మధ్య ప్రపంచకప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ తిలకించేందుకు భువనచంద్ర టౌన్‌హాలులో ఆదివారం ప్రత్యేకంగా బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మ్యాచ్‌ను తిలకించేందుకు పెద్దసంఖ్యలో క్రికెట్ అభిమానులు చేరుకున్నారు. ఇండియా బ్యాటింగ్ చేస్తున్నంత సేపు ఫోర్లు, సిక్స్‌లు, బంతి బంతికి కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఫైనల్ మ్యాచ్ కావటంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. టీకొట్లు, బడ్డీషాపులు సైతం మూసేసి ఇళ్లల్లో మ్యాచ్‌ను తిలకించారు.

ఐనవోలు ఎస్ఐగా లక్ష్మీనారాయణరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఐనవోలు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా లక్ష్మీనారాయణరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న అనిల్ కుమార్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో లక్ష్మీనారాయణరెడ్డి వచ్చారు. ఈయన గతంలో వినుకొండ, ఫిరంగిపురం, జి.ముప్పాళ్ల, మాచవరం స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

అగ్నిప్రమాదంలో చర్చి దగ్ధం

బొల్లాపల్లి: మండలంలోని సరికొండపాలెం ఎస్సీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో కల్వరి మహిమ ప్రార్థన మందిరం దగ్ధమై రూ.2లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు చర్చి పాస్టర్ తానంచింతల ప్రభుదాసు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) నాయకులు ప్రమాదస్థలాన్ని సందర్శించి తక్షణ సాయం కింద రూ.5వేలు అందజేశారు. ఏఐసీసీ మండల కార్యదర్శి దేవరాజ్ నాయక్, సభ్యులు రోషన్‌కుమార్, డేవిడ్, యేసురాజు, బుజ్జిబాబు, దేవరాజు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

నివాస గృహం ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో బోడెపూడి ప్రసాదు – రోహిణి దంపతులకు చెందిన తమ స్థలంలో ఏర్పాటు చేసుకున్న నివాస గృహాన్ని ఖాళీ చేయాలంటూ కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేసినట్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు మేరకు నరసరావుపేట చెందిన మాలపాటి సీత, సాయికుమార్ తన అనుచరులు అక్రమంగా పొక్లెయిన్ ద్వారా బోడెపూడి ప్రసాదుకు చెందిన నివాస గృహాన్ని పడవేసే యత్నాలు చేస్తుండగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకునేలోగా బాత్‌రూమ్‌తో పాటు ఇంటి బయట ఏర్పాటు చేసుకున్న గచ్చును పగలకొట్టారు. తక్షణమే పోలీసులు పనులను అడ్డుకొని పొక్లెయిన్‌ను పోలీసు స్టేషనుకు తరలించి ఫిర్యాదుదారుడు బోడెపూడి ప్రసాదు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు మోసగాడు

- 27న జరిగే సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: చంద్రబాబు మాయల మరాఠీ అని, ఒక మోసగాడు అని... పవన్ కిరాయి కోటిగాడని.. వీళ్లిద్దరూ కలిసినా జగన్ ఓడించడం వారి తరం కాదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గస్థాయి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. మంత్రి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు గత ఎన్నికల ముందు డ్వాక్రా రుణమాఫీ, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి గద్దె నెక్కాడన్నారు. అధికారం చేపట్టాక హామీలను విస్మరించి ప్రజలను వంచన చేశాడని విమర్శించారు.
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే హామీలను అమలు చేయటం మొదలు పెట్టారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం హామీలను అమలు చేసి చరిత్రలో నిలిచిపోయాడన్నారు. వైఎస్సార్ సీపీకి క్షేత్రస్థాయి నుంచి బలమైన వ్యవస్థ ఉందన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఏ రాజకీయపార్టీకి లేనంత పటిష్టమైన యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మనకు అందించాడని వివరించారు. రానున్న నాలుగు నెలల్లో మీరందరూ సమష్టిగా క్రియాశీలకంగా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. ఈ నెల 27వ తేదీన సత్తెనపల్లిలో సామాజిక సాధికార (బస్సు)యాత్ర జరుగుతుందన్నారు. సత్తెనపల్లి మండలం ఎన్నాదేవి వద్ద నుంచి సామాజిక సాధికార పాదయాత్ర ప్రారంభమై పట్టణంలోని తాలూకా సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను మంత్రి అంబటి సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం నకరికల్లు మండలాల పార్టీ కన్వీనర్లు రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు కట్టా సాంబయ్య, ఎంజేఎమ్ రామలింగారెడ్డి (చిన్నా), శిరిగిరి గోపాలరావు, రెండుఎద్దుల వెంకటేశ్వరరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎం.యూనస్, ప్రజాప్రతినిధులు, నియోజవర్గస్థాయి నాయకులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- టీడీపీకి చెందిన 20 కుటుంబాలవారు వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందరికీ పార్టీ కండువాలు కప్పి, ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజల్లో, ముఖ్యంగా వారి పార్టీ నాయకుల్లోనే నమ్మకం పోయిందన్నారు. గతంలో 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు చేసిన అభివృద్ధి ఏమిటి అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, బడుగు బలహీనవర్గాల వారందరికీ అండగా ఉండటంతో పాటు అర్హత కలిగిన వారందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కంచర్ల గాలీబు, సిద్దారపు చినమౌలాలి, వలపర్ల కాశీయ్య, షేక్ ఖాశీం సాహెబ్, నిశ్శంకి నాసరయ్య, ఆవుల శ్రీనివాసరావు, చెవల కృష్ణయ్య, చెన్నంశెట్టి నరసింహారావు, సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: కార్తిక మాసం సందర్భంగా పట్టణంలోని పోలిరెడ్డిపాలెంలో వేంచేసియున్న శ్రీసిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, విడదల కమలేంద్ర, తోట బ్రహ్మస్వాములు, వడితే కోట్యానాయక్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ఎండుగుంపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావుతో పాటూ అధికారులు పాల్గొంటారన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్

- జిల్లా ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామ్ హుస్సేన్
- ఉత్సాహంగా హమ్‌సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం


యడ్లపాడు జామియా ఉల్‌హుదా మసీదులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకులు

యడ్లపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని పల్నాడు జిల్లా ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామ్ హుస్సేన్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్' కార్యక్రమం ఆదివారం యడ్లపాడు మండలంలో నిర్వహించారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, బాపట్ల వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలితో కలసి ఆయన యడ్లపాడు మండలాన్ని సందర్శించారు. కారుచోల, యడ్లపాడు, వంకాయలపాడు, బోయపాలెం, కోట, కొండవీడు, సొలస, లింగారావుపాలెం గ్రామాల్లోని మసీదుల్ని వారు సందర్శించారు. ఆయా గ్రామాల్లోని మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలతో సమావేశాలు నిర్వహించారు. మసీదుకు సంబంధించి ముస్లింలకు స్థానికంగా ఉన్న అవసరాలు అడిగి తెలుసుకుని ఆయా సమస్యల్ని నమోదు చేసుకున్నారు. ఇమామ్ హుస్సేన్ మాట్లాడుతూ హర్ దిల్‌మే వైఎస్సార్ కార్యక్రమం పలు ప్రాంతాల్లో నిత్యం చేస్తున్నామని ముస్లింల నుంచి ఆయా ప్రాంతాలలో విశేష స్పందన లభిస్తుందన్నారు. మైనార్టీ సబ్‌ప్లాన్ తీసుకువచ్చారని తెలిపారు. సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో ముస్లిం వర్గాలకు 34,17,199 మందికి వివిధ పథకాల ద్వారా రూ.11,896 కోట్ల లబ్ధిని చేకూర్చారని వివరించారు. పట్టణ పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ మసీదుల్లోని ఇమామ్‌ల గౌరవ వేతనాలను రూ.5వేల నుంచి రూ.10 వేలకు, మౌజన్‌లకు రూ.3వేల నుంచి రూ.5వేలకు పెంపుదల చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక ముస్లింలు అతిథుల్ని సత్కరించారు. మైనార్టీ నాయకులు సయ్యద్ హుజేఫా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖాజీ సయ్యద్ మస్తాన్, సయ్యద్ హుజేఫా, సయ్యద్ సుభాని, ఆదంబుడే, అబ్దుల్‌సత్తార్, షేక్ ఖాదర్‌బాష, జిలాని, సయ్యద్ మస్తాన్‌వలి, షేక్ అలి, అల్లావుద్దీన్, షేక్ షంషుజుహా, అబ్దుల్ ఖాదీర్, జాకీర్‌హుస్సేన్, మస్తాన్‌వలి, ఇస్మాయేల్, మాబు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనలతో ఆధ్యాత్మిక చింతన

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: ఆధ్యాత్మిక చింతనతోపాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తిక వనసమారాధనలు చాటి చెబుతాయని జిల్లా ఎస్పీ పి.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కుంకలగుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధర్యంలో 14వ కార్తిక వనసమారాధనను ఆదివారం రావిపాడు రోడ్డులోని కృష్ణచైతన్య కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా పోడా వైస్ చైర్మన్ డాక్టర్ గజ్జల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ కృష్ణా జిల్లా మేనేజర్ డాక్టర్ అత్తలూరి శ్రీధర్‌లు హాజరయ్యారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో నివసిస్తున్న కుంకలగుంట గ్రామానికి చెందిన వారు గత 14 సంవత్సరాలుగా కార్తిక వనసమారాధనలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, కొల్లి బ్రహ్మయ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు, ఎస్‌కే సుభాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీల్లో పెద్ద, చిన్నా ఉత్సాహంగా పాల్గొన్నారు.

రహదారి భద్రత.. సామాజిక బాధ్యత


వాకథాన్ నిర్వహిస్తున్న ఆర్టీఓ, ట్రాఫిక్, ఆర్టీసీ అధికారులు, విద్యార్థులు

నగరంపాలెం: దేశవ్యాప్తంగా ఏడాదికి ఐదు లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో 1.60 లక్షల మంది మృత్యువాతకు గురవుతున్నారని, మరో ఐదు లక్షల మంది గాయపడుతున్నారని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం అన్నారు. రహదారి ప్రమాదాల బాధితుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రవాణా, పోలీస్ శాఖ సంయుక్తంగా ఆదివారం పోలీస్‌పరేడ్ గ్రౌండ్ నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు విద్యార్థులు, ఆటో/ బస్ డ్రైవర్లతో వాకథాన్ నిర్వహించారు. ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం మాట్లాడుతూ ప్రతి వాహన చోదకుడు రహదారి భద్రత సామాజిక బాధ్యతగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే ఆలోచనతో వాహనాలను జాగ్రత్తగా నడపాలని అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణతైన విద్యార్థులు వాహనాలు నడుపుతూ ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.

దిశ చట్టం – మహిళా సాధికారతపై అవగాహన


ముప్పాళ్లలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న గ్రంథాలయ అధికారిణి నాగలక్ష్మి, విద్యార్థులు

ఈపూరు: 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈపూరులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా దిశ చట్టం– మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈపూరు హైస్కూల్ ఉపాధ్యాయురాలు అరుణకుమారి పాల్గొని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దిశ చట్టం గురించి వివరించారు. అలాగే హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థినులకు రన్నింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో..

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 6వ రోజు గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు దిశ చట్టంపై అవగాహన కల్పించి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, లైంగిక దాడులను అరికట్టేందుకు దిశ పేరుతో చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ చట్టం ద్వారా మహిళలకు తక్షణమే న్యాయం జరుగుతుందని తెలిపారు. మహిళాసాధికారత గురించి వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్.సేవానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు ఆదివారం వినుకొండ శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యావికాస్ హైస్కూల్‌లో దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఖోఖో, వక్తృత్వం, వివిధ రకాల పోటీలు నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు గోపిచంద్ మాట్లాడుతూ గ్రంథాలయాల వల్ల ఎంతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని తెలిపారు. దిశ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, గ్రంథాలయ అధికారి భూక్యా బద్రీనాయక్ పాల్గొన్నారు.

బాలల అభ్యున్నతికి కృషి చేయాలి

నరసరావుపేట ఈస్ట్: బాల బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు పద్మావతి తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పాఠశాల బాలికల వసతిగృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ, చిన్నారులకు సామాజిక భద్రత పొందే హక్కు ఉందని వివరించారు. దేశ సంపదైన బాలల అభ్యున్నతికి ప్రతి ఒక్క రూ కృషి చేయాలన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు. కాగా, దాతల సహకారంతో వసతిగృహంలోని 22మంది బాలికలకు చలికోట్లు పంపిణీ చేశారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ సంతోష్‌కుమార్, నాదెండ్ల సీడీపీఓ శాంతికుమారి, హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే శబరిమలై భక్తుల సౌకర్యార్థం గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను కేటాయించడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. సికింద్రాబాద్–కొల్లం(07219) ప్రత్యేక రైలును ఈనెల 26, డిసెంబర్ 3వ తేదీన గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు కొల్లం చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా కొల్లం–సికింద్రాబాద్(07130) రైలు ఈనెల 28, డిసెంబర్ 5వ తేదీల్లో డివిజన్ మీదుగా నడుస్తుందని తెలిపారు. ఈ రైలు కొల్లం స్టేషన్ నుంచి అర్ధరాత్రి 2.30 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 8.55 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. కాచిగూడ–కొల్లం(07123) రైలు ఈనెల 22, 29 తేదీల్లో, డిసెంబర్ 6వ తేదీన గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. కొల్లం–కాచిగూడ(07214) రైలు ఈనెల 24, డిసెంబర్ 1, 8వ తేదీలలో డివిజన్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.


దేశాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

నరసరావుపేట ఈస్ట్: దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వివిధ శాఖల మహిళా అధికారులు తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సదస్సులో జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారిణి దీప్తి, జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారిణి వి.నాగిని, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిణి లోతేటి వరలక్ష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని యువత ఎదగాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అవాంఛనీయ ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన దిశ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు రంగోళి పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి రాధ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పుష్పయాగం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వేంచేసి ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహిళలు పెద్దఎత్తున పాల్గొని శ్రీవారికి పుష్పయాగం నిర్వహించారు. తొలుత పట్ట ణంలో పుష్పాలతో ఊరేంపు నిర్వహించి స్వామివారికి యాగం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీవారికి అర్చన, బాలభోగం, ద్రవ్యశుద్ధి ఆరాధన, బెంగళూరు నుంచి తెప్పించిన 108 రకాల తామ ర పుష్పాలతో యాగం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ, భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణసుబ్బారావు, కోశాధికారి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

మారథాన్‌లో వినుకొండ క్రీడాకారుని ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా ఆదివారం విజయవాడ మారథాన్ వారు జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో ప్రతిభ చాటాడు. 21 కిలోమీటర్ల ఈ పందెంలో లక్ష్యాన్ని 1.27 నిమిషాల్లో పూర్తి చేసి పార్టిసిపేషన్ మెడల్ సాధించడం జరిగింది. త్వరలో పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనున్నట్లు అబ్దుల్లా తెలిపారు. ప్రతిభ చూపిన షేక్ అబ్దుల్లాను పట్టణంలోని పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

యడ్లపాడు: ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం సంగంగోపాలపురం గ్రామానికి చెందిన కాళహస్తి నాగప్రసన్న(24) అదే గ్రామానికి చెందిన ఏడుకొండలుతో కొద్దికాలం కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులతో మనస్థాపం చెందిన నాగప్రసన్న ఈనెల 14న ఇంట్లో ఎలుకల మందు సేవించింది. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి మల్లవరపు దేవలక్ష్మి ఫిర్యాదు మేరకు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు వితరణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జీవీ మాధవరావు ఆఫీసులో ఎనిమంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు రామరాజు, ప్రధాన కార్యదర్శి జి. వాసుదేవరావు, కార్యనిర్వాహణ అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, పసుపుల మురళీకృష్ణలు పాల్గొని నిత్యావసరాలు అందజేశారు. అప్పరాజు నాగేశ్వరరావు, దారా రామ్మూర్తి, మాదిరాజు నాగేశ్వరరావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు...

వినుకొండ(నూజెండ్ల): సంకల్ప సేవాసమితి ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల ఉషోదయ సెయింట్ ఆన్స్ బధిరుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జానీబాషా (జిమ్‌జానీ), 2వ వార్డు కౌన్సిలర్ బత్తుల వీరమ్మ, సేవా సమితి గౌరవాధ్యక్షుడు గురజాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.